ఉత్సాహం కనబర్చలేకపోయారు. కాందిశీకుల సమస్యతో ప్రారంభమయిన మన కష్టాలు ఇంతవరకూ తెల్లారనేలేదు.

# పూలబజారు

స్త్రీలకు పూలపై ఉండే మోజుని మాటల్లో చెప్పడం కష్టం. చిన్నా పెద్ద వయోభేదం లేకుండా ఆడవాళ్ళంతా పూలు పెట్టుకోవడానికి మనసు పడతారు. జడ తేలుకొండి అంతవున్నా దానికో దండను వేలాడ కడితేగాని పూరుకోదు మాచంటి. మొన్నీ మధ్య పూలజడ వెయ్యమని గోలపెట్టింది. దానికి జడలేదు. ఇంక ఏడుపు భరించలేక నల్లరిబ్బనలతో కట్టి దానిమీద అట్టతో మల్లెపూలు కుట్టి జడ తయారుచేసేసరికి పొద్దు పోయింది. అది ప్రక్కన పెట్టుకుని నిద్రపోయాక తెల్లారి నల్లగా వాడిపోయిన ఆ జడనే పిన్నీసులతో, దారాలతో వెనక వేళ్లాడేసుకుని తిరిగింది. అది అంతే దానికి పూలపిచ్చి. కొనకపోతే వాళ్ళూ వీళ్ళూ పారేసిన దండల్ని ఏరుకొచ్చినా చేత దెబ్బలు తింటుంది.

కొనరాదా ఓ పది పైసలు పారేసి, దానికింత రాద్ధాంత మెందుకు అంటారు. వాళ్ళని వెనకేసుకొస్తూ తండ్రి. కొంటాం, కొనకుండా ఎలా ఎలా వెళ్తాయి రోజులు. పీకి పిండెట్టే సెయ్యదూ - కాని పది పైసలవి కొన్నా పది రూపాయలిచ్చి కొన్నా ఆ పూలన్నీ నావే నంటుంది - ఉంకోర్ని ముట్టుకోనియ్యదు. ఇవతలకి లాగి దాన్ని నాలుగేసి అందరికి కట్టిస్తే వాళ్ళ తలల్లోవి వెనక పీకేస్తుంది. ఈ అల్లరీ ఆగమూ భరించలేక పూలు వద్దు పూలతో ఈ పేచీలు వొద్దు అని నోరుమూసుకున్నా. నేనైనా సరే అది చూడకుండా తల్లో పెట్టుకుని ఏ పని చేస్తున్నా చేయి వెనకే నెత్తిమీదే వుంచుకోవాలి. లేకపోతే మెరుపుదాడిలా ఎట్నుంచి వొస్తుందో వచ్చి పీకేసి తుంపులు తుంపులుగా చేసి దెబ్బలు తింటుంది. పిల్లలకది సహజం - ఏం సమాజమండీ - పిల్లలుపుట్టాక అందులో ఆడపిల్లల తల్లుల సరదాలన్నీ గంగలో కలిసినట్లే - అనకూడదుగాని ఓ మంచి బట్ట కట్టుకుంటే చూళ్ళేరు. పూల సంగతి సరేసరి. ఆఖరికి అందరికీ పీకలదాకా మెక్క బెట్టాక మిగిలింది అడుగో బొడుగో కాస్త నోట్లో వేసుకుందామని కూర్చున్నా చేతుల్లోంచి లాక్కుపోతారు. తల్లితో ప్రతీదానికి పోటీ వస్తారు. ఆడపిల్లలు వాళ్ళ పరికిణీలు ఓణీలు జాకెట్ల ఖర్చుకు మనకు రెండు మూడు కట్టుడు చీరలొస్తాయి. వాళ్ళకి జ్ఞానం వచ్చేసరికి తల్లిమీద ప్రేమలూ అభిమానాలూ పుట్టుకొచ్చే సరికి మనవీ లోకంలో వుంటామో వుండమో...ఎవ్వారి కెవ్వారో... అంచేత ఈ సంసారమంతా మాయ ఇందులో చిన్నా పెద్దా అని తేడాలేదు - ఎవరి స్వార్థం, ఎవరి గొడవ వారిది-ఆఖరికి నిల్చున్న వాళ్ళు నిల్చున్నట్లు ఎవరో శాపం పెట్టినట్లు మాడి పోయేది కన్న తల్లితండ్రులే- పండుటాకులూ రాలక తప్పదు కదా!

పూల పేచీలతో ప్రారంభించి కట్టెల ఫిలాసఫీ వరకూ వెళ్ళాం అనవసరంగా. పూల వ్యాపారం మంచిదా, కట్టెల వ్యాపారం మంచిదా అని ఎవర్నేనా అడగండి? టక్కున చెప్పేస్తారు కట్టెల వ్యాపారం పెద్దది, లాభసాటి వ్యాపారమని. పూవులమ్మే వాళ్ళు నైసుగా షోగ్గా గీతాంజలి, రమాప్రభ, జ్యోతిలక్ష్మిల్లా వుంటారనుకునే రోజులు వెళ్ళిపోయాయి. ఇప్పుడు పూవులమ్మే వాళ్ళు బీడీలు కాలుస్తూ బ్రాకెట్ల గురించీ సినిమాల గురించీ జీవితం గురించీ లోకాభిరామాయణాలు చెప్పుకొంటూ అమ్ముతారు. వాళ్లు చేతుల్కెనా అమ్ముతారు, తూచీ అమ్ముతారు. దండలు కట్టి మూరలెక్కనా యిస్తారు. ఈ మూరల్తో చాలా తగూ వుంది. మనం పిల్లను పంపిస్తే రెండు పది పైసలు తీసుకుని దానిమూరతో కొలిచి యిస్తాడు మనం వెళ్ళి పెద్దవాళ్ళం మన మూరతో కొలిస్తే 'అలా పనికి రాదండీ' అని దబాయిస్తాడు.

పూల వ్యాపారం ఎంత ఘుమ ఘుమలాడే వ్యాపారమైనా చిల్లర బేరాలన్నీ పది పైసలూ పావలాలూ ఐదు పైసలే - ఇందులో మళ్ళీ ఓల్ సెల్లర్లూ, కమీషన్ ఏజంట్లూ, రిటైలర్లూ వుంటారు. ఒకసారి ఓ ముసలావిడ మూడు సంపెంగ పూల్ని పట్టుకొని కొనమని మావారిని ఆశీర్వదిస్తూ అడిగిందట, పావలా యిచ్చి తీసుకున్నారు. ఆవిడ పెద్దది. ఏదన్నా తినాలనున్నప్పుడు పెరట్లోని సంపెంగ పూలు కోసి బజారులో కెళ్ళి ఎవర్నో ఒకర్ని కొనమని వాళ్లిచ్చిన డబ్బులెట్టి అరిటి పండో, ఇడ్లీ ముక్కో ద్రాక్షపళ్ళో కొనుక్కు తింటుందట. ముసలావిడ కదా పెద్దదని ఎవరో ఒకరు కనికరించి ఎంతోకొంత యిచ్చి ఆ పూలు తీసుకుంటారు. "ఆవిడకు కోపం కూడా హెచ్చు - ఎంత సేపిలా నుంచోడం - ఎవరూ కొనరే మర్రా మీ మొహం మండా" అని తిట్టుకుంటూ మరో బజారుకు వెళ్ళిపోతుందట. ఈవిడ పుష్పలావిక అనగలమా. అనలేం అనలేం. మాచిన్నప్పుడు పచ్చ గన్నేరు పూలు ఏరి గుచ్చి మెళ్ళో వేసుకునే వాళ్లం, ఎర్ర గన్నేరు, మందార, గంటల మాలతి, నందివర్ధనం, పారిజాతాలంటే నాకెక్కువిష్టం. బొగడచెట్టు కాని పెరట్లో వుంటే తెల్లారి లేచేసరికి నేలంతారాలిన పూలతో కోరుకున్న జీవితం నిండాపిండిన కలలు పరుచుకున్నట్లు లవ్లీగా వుంటుంది. మందార పువ్వుకి పచ్చని తొడిమి వుంటుంది. అది తీసేసి నోట్లో పెట్టుకుని పీలిస్తే తియ్యగా వుంటుంది. బంతి పువ్వురేకులు తీసి బొడిపె తింటే రుచిగా వుంటుంది. మందార పూలు, బంతిపూలు కొండవాళ్ళు పెట్టుకుంటారు. తెలుగువాళ్ళు 'ముద్దబంతి పూవు' అని లిటరరీగా మెచ్చుకోవటమే కాని బంతి పూలు పెట్టుకోరు. పిల్లలు అన్నీ పెట్టుకుంటారనుకోండి. చెరువులున్న వూళ్ళల్లో పుట్టి పెరిగిన వారికి ఎర్రకలువలూ, తెల్ల కలువలూ, పద్మాలు వాటిని సేకరించటంలోని సొగసులూ తెలుస్తాయి. అయ్యో యిప్పుడు పూలతోటలు పీకేమని అనేవాళ్లు కూడా ఉన్నారు. పూలకోసం బెంగెట్టుకునే వాళ్ళు వున్నారు.

పూర్వం కావ్యాల్లో పురవర్ణనల్లో పుష్పలావికల్ని వర్ణించడం మన కవుల హాబీ. కాని ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటే పూల అంగళ్లలో అలాటి పుష్పలావికలూ లేరు. అలాంటి సరస వినోద శృంగార సంభాషణాలూ లేవు. కూరల వ్యాపారం, పూల వ్యాపారం. పళ్ల పొడి

వ్యాపారాల లాగ పుష్ప విక్రయం చిన్న సైజు టాలాటోలీ వ్యాపారంగా మిగిలిపోయింది. అయితే పూలమీద మోజు ఎంతకాలం మారినా తరగలేదు, తరగబోదు. క్యాబేజీ పూలూ గోబీపూలూ బీరపూలూ కూడా తల్లో పెట్టుకోవాలని సరదా పడుతుంది మా అమ్మాయి. పూలపిచ్చి ఎంత చెప్పినా అర్థం కానిది. పూలని మనం నిరాదరిస్తే చిరునవ్వుల్ని జీవితంలోంచి నిషేధించినట్లే -

# చదరంగపుటాల్జీబ్రా

ప్రపంచ చతురంగ పోటీలు కావు కాని మా ఇంట్లో మేవంతా చతురంగ ప్రవేశం చేయాలి సొచ్చింది. బాబీ, స్పాస్కీల పేర్లు నిత్యం రామనామస్మరణే -ఎక్కడో అయిసులాండట - అక్కడ ప్రపంచ ఛాంపియన్ షిప్‌కు పోటీలు జరగడవేమీ, యిక్కడ మేము బుజాలు ఎగరెయ్యడమేవి? ఏమిటో ప్రపంచం చాలా చిన్నదయి పోతూంది ఎవరో అన్నట్లు - రోజూ పొద్దున్నే పేపరు రాంగానే టార్జాన్ కూడా చూడటం మానేసి వెనక్కు తిప్పి "ఇవాళ గేం" ఎలా ఆడారు, ఏం జరిగింది అని ఆత్రంగా చూడందే కాఫీ కూడా గుటకెయ్య బుద్ధి కావడంలేదు. పీకేఫోర్, పీకేబిత్రీ, పీక్వ్యాఫోర్ లంటూ చదరంగపు టాల్జిబ్రా భాషరాని వాళ్ళు దంగై పోవడంకద్దు. ఇప్పుడిప్పుడే చదరంగం ఆట తెలీకపోవడం, క్రికెట్ ఆట చూడటం రాకపోవటమంత నేరమై కూర్చుంది. ఇది మేధావు లాడే ఆట కావటం వలన చదరంగంరాని పేకాట మిత్రులు ఈ మాట్లాడుకుంటూంటే, చిన్న మొహం చేసుకుంటున్నారు. అందులో అస్తమానం బాబీఅల్లా ఆడాడు, స్పాస్కీఇల్లా ఆడాడు ఆ బంటు తోయడం తప్పు, ఈ ఏనుగుల్ని యిలా వేయకుండా వుండాల్సింది అంటూ నోటికొచ్చినట్లు ప్రేలుతున్నప్పుడు ఈ ఆటరానివాళ్ళ ముఖాలు వచన కవిత్వం అర్థంకాని పాఠకుల ముఖాలకిమల్లే వెలవెలబారుతున్నాయి. ఎక్స్ ప్రెస్‌లో వేసిన ఆట భోగట్టా ప్రకారం బల్లమీద బలగాన్ని పేర్చి ఆడుకోవటం ఒక ఏకాంతపు సరదా అయిపోయింది.

ఈ గేములు డ్రా కావటం గురించి చర్చించుకునేప్పుడు చాలామంది ఆట రానివాళ్లు దీని పరిభాష విని "చదరంగపు టాల్జీబ్రా" కామోసుననుకుని, మనం వెనకబడిపోయామే అని నాలిక్కర్చుకుంటున్నారు గాభరాగా.

పేకాట గొప్పదా చదరంగవా అన్న ప్రశ్న చచ్చు ప్రశ్న. దీని మాహాత్మ్యం ముందు యితర ఇండోర్ గేమ్సన్నీ దిగదుడుపే - ఈ ఆటలో రాజ్యాలు పోతాయి, హత్యలు జరుగుతాయి - జయాపజయాలకు - ఆడవారిదే బాధ్యత పూర్తిగా. చూడండి క్రికెటువాళ్ళు పిచ్చి బాగులేదు. వర్షంపడింది, బంతి బరువు సరిగా లేదు అని సవాలక్ష కారణాలు చెప్పొచ్చు. చదరంగానికి